పింఛన్లతో అర్హులందరికీ భరోసా

- ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్
- తాళ్లరేవు, కాట్రేనికోనల్లో కొత్త పింఛన్ల పంపిణీ



తాళ్లరేవులో లబ్ధిదారులకు కొత్త పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో అర్హులందరికీ పింఛన్లు అందజేస్తూ భరోసా కలిస్తున్నామని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక కార్యక్రమానికి ఎమ్మెల్యే పొన్నాడ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా పేదరికమే ప్రామాణికంగా ఇంటింటా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. తాళ్లరేవు మండలంలో 595 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పొన్నాడ నూతనంగా మంజూరైన పింఛన్లను అందజేశారు. కార్యక్రమంలో ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకులు అనుబాబు, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, మాజీ జెడ్పీ చైర్మన్ దున్నా జనార్దనరావు, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కాద గోవింద కుమార్, రాయుడు గంగాధర్, వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కాట్రేనికోన: రాష్ట్రంలో సంక్షేమ రాజ్యం నడుస్తుందని, అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ అన్నారు. స్థానిక మార్కెట్ యార్డు వద్ద గురువారం ఆయన 477 మంది లబ్ధిదారులకు నూతనంగా మంజూరైన పింఛన్లను పంపిణీ చేశారు. మండలంలో కొత్త పింఛన్లతో కలిపి 10,661 మందికి పింఛన్ల రూపేణా ప్రతి నెలా రూ.2,88,86,000 అందజేస్తామన్నారు.

మంత్రి ఆదేశాలతో పింఛన్‌ల పంపిణీ

ఉప్పలగుప్తం: రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ఆదేశాలతో మండలవ్యాప్తంగా నూతన పింఛన్‌లు అందించినట్టు ఎంపీడీవో గౌరీకుమారి గురువారం తెలిపారు. మండలవ్యాప్తంగా వృద్ధాప్య పింఛన్లు 138, వీవర్స్ పింఛన్లు 6, గీత కార్మికుల ఫించన్లు 1, మత్స్యకార పింఛన్లు 9, వికలాంగ పింఛన్లు 37, వితంతువులకు 92 పింఛన్లు మంజూరయ్యాయన్నారు.

అమలాపురం టౌన్: సామాజిక పింఛన్లు అందుకుంటున్న అవ్వాతాతల జీవితాలకు ప్రభుత్వం భరోసా కల్పిస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అన్నారు. మున్సిపాలిటీలోని 23వ వార్డులో కొత్తగా మంజూరైన పింఛన్లను మున్సిపల్ కార్యాలయలోని తన చాంబర్‌లో గురువారం ఆమె అందజేసి ప్రసంగించారు. పట్టణంలో కొత్తగా 225 కొత్త పింఛన్లు మంజూరయ్యాయన్నారు. కార్యక్రమంలో 23వ వార్డు సచివాలయ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లి గ్రామంలో సర్పంచ్ సలాది ఊర్మిళాదేవి ఆధ్వర్యంలో 15 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్‌లను గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో విలసవిల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు సలాది సతీష్, జంపన బాపిరాజు, రాయపురెడ్డి నాగు తదితరులు పాల్గొన్నారు. భీమనపల్లి పంచాయతీ పరిధిలో సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో 20 మంది లబ్ధిదారులకు నూతన పింఛన్లను అందజేశారు.

అల్లవరం: మండలంలోని కొమరగిరిపట్నం సచివాలయంలో నూతనంగా మంజూరైన 476 కొత్త పింఛన్లను ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు లబ్ధిదారులకు గురువారం అందజేశారు. సర్పంచ్ రాకాపు విజయలక్ష్మి అధ్యక్షతన కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. బోడసకుర్రులో సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి ఆధ్వర్యంలో 23 కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. గూడాలలో సర్పంచ్ దాకారపు చిరంజీవిరావు ఆధ్వర్యంలో 20 కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కొనుకు గౌతమి, వైఎస్ ఎంపీపీలు వడ్డి గంగ, ముత్యాల వెంకటరామకృష్ణ, సర్పంచ్‌లు కడలి గంగాచలం, చిట్నీడి శ్రీదేవి, నడింపల్లి సుబ్రహ్మణ్యంరాజు, తిక్కిరెడ్డి శ్రీను, బర్రే సీతారత్నం పాల్గొన్నారు.

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరులో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరి రామ్‌గోపాల్, సర్పంచ్ అరుణల చేతుల మీదుగా గురువారం పంపిణీ చేశారు.



కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి



విలసవిల్లిలో లబ్ధిదారులకు పింఛన్లు అందజేస్తున్న సర్పంచ్ ఊర్మిళాదేవి



లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శేషగిరిరావు

క్లుప్తంగా

కంప్యూటర్ బహూకరణ



కంప్యూటర్‌ను ప్రారంభిస్తున్న ఆర్‌ఎం కె.విజయరాజు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి బ్యాంక్ ఆఫ్ బరోడా తరఫున రీజనల్ మేనేజర్ కె.విజయరాజు కంప్యూటర్ బహూకరించారు. గురువారం ఆలయంలో ఆయన కంప్యూటర్‌ను ప్రారంభించి ఆన్‌లైన్‌లో తొలిసేవను నమోదుచేసుకున్నారు. ఇది భక్తులకు ఎంతగానో ఉపయోగపడుతుందని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు అన్నారు. కార్యక్రమంలో బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా వ్యాసరచన పోటీ

యానాం: టాటా గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఆధ్వర్యంలో గురువారం స్థానిక రీజెన్సీ జూనియర్ కళాశాలలో ×టాటా బిల్డింగ్ ఇండియా⁕ అనే అంశంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీలు ఉత్సాహంగా జరిగాయి. సుమారు 120 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభను ప్రదర్శించారు. కార్యక్రమంలో టీసీఎస్ ప్రతినిధి కృష్ణవర్మ, ప్రిన్సిపాల్ మార్తాండప్రసాద్, అధ్యాపకులు పాల్గొన్నారు.

దేశ సమైక్యతకు హిందీ భాష దోహదం



హిందీ భాషా దినోత్సవం నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

యానాం: భారతదేశంలో అనేక ప్రాంతీయ భాషలున్నా జాతీయ భాష హిందీని నేర్చుకోవడం ద్వారా జాతీయ సమైక్యతకు దోహదం చేసినట్లవుతుందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు అన్నారు. గురువారం మెట్టకూరు నవోదయ విద్యాలయలో జాతీయ హిందీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హిందీ పక్షోత్సవాలను ఆయన జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం విద్యార్థుల హిందీ కవితలు, దేశభక్తి గీతాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో సీనియర్ హిందీ అధ్యాపకులు టీవీఎస్ఆర్‌జే శాస్త్రి, వైస్ ప్రిన్సిపాల్ బేగం, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఢీకొన్న వ్యాను

తాళ్లరేవు: మండలంలోని పటవల పంచాయతీ కొత్తూరు వద్ద జాతీయ రహదారి చెంతనే ఉన్న అంబేడ్కర్ విగ్రహాన్ని గురువారం తెల్లవారుజామున చేపల వ్యాను ఢీకొనడంతో విగ్రహం ధ్వంసమైంది. దీంతో దళిత యువకులు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన చేశారు. పోలీసులు వ్యాను యజమాని, ఆందోళనకారులతో చర్చలు జరిపారు. కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని వ్యాను యజమాని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పటవల సర్పంచ్ పినపోతు చినకామేశ్వరరావు, మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెయ్యల రమేష్, కార్యదర్శి తాడి షణ్ముఖరాజులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

అల్లవరం: వరిపై ఆకుచుట్టు పురుగు ఉధృతంగా ఉన్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధికారి ఎస్‌వీ సత్యనారాయణ అన్నారు. గురువారం అల్లవరంలో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఆకుచుట్టు పురుగు నివారణకు ఫ్లూబెండామైడ్ 30 మి.లీ. లేదా కార్టాప్ హైడ్రాక్లోరైడ్ 300 గ్రాములు లేదా హరికేన్ ప్లస్ 100 మి.లీ. మందుని ఎకరానికి పిచికారీ చేయాలన్నారు. వేప గింజల కషాయం తయారు చేసే విధానంపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు బొక్కా శ్రీను, కొనుకు బాపూజీ, కుడుపూడి నాగేశ్వరరావు, నడింపల్లి రామకృష్ణంరాజు, వీఏఏ శుభగణేష్ పాల్గొన్నారు.

శివన్నారాయణకు జాతీయ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డు

తాళ్లరేవు: ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ప్రముఖ న్యాయవాది యడ్ల కుటుంబరావులు జాతీయ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డులకు ఎంపికై నట్లు విశ్వజన కళామండలి జిల్లా అధ్యక్షుడు వడ్డి ఏడుకొండలు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రెడ్డి గిరిబాబు, పెయ్యల రమేష్, టేకుమూడి ఈశ్వరరావు, వాకపల్లి చిరంజీవి, దడాల సువర్ణలత స్టేట్ అంబేడ్కర్ ఫెలోషిప్ అవార్డుకు ఎంపిక చేశామన్నారు. వారికి ఈ నెల 15న అమలాపురం అంబేడ్కర్ భవన్‌లో అవార్డులు ప్రదానం చేస్తామన్నారు.

ఫొటో, వీడియోగ్రాఫర్‌లను ఆదుకోవాలి

ఉప్పలగుప్తం: వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గ్రామీణ ఫొటో, వీడియోగ్రాఫర్‌లను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని లూయీస్ ఫొటో, వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ విజ్ఞప్తి చేసింది. గురువారం గొల్లవిల్లిలో అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మండల అధ్యక్షుడు దేవరపల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు భార్గవి



విద్యార్థిని భార్గవిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కోటిలింగం, డీవీఈవో సత్యనారాయణరెడ్డి

అమలాపురం టౌన్: అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాలలో కాకినాడ సెట్రాజ్ నిర్వహించిన జిల్లా స్థాయి యువజనోత్సవ పోటీల్లో విద్యార్థిని గుత్తుల భార్గవి పాల్గొని హస్త కళల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ సందర్భంగా భార్గవిని కళాశాలలో ప్రిన్సిపాల్ కవల కోటిలింగం, జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్(డీవీఈవో) ఎస్ఎస్‌వీ సత్యనారాయణరెడ్డి గురువారం అభినందించారు. ఇటీవల రామచంద్రపురంలో జరిగిన అండర్–19 బాస్కెట్‌బాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని బీర జయశ్రీని సైతం అభినందించారు.

ఇండియన్ ఐకాన్ అవార్డు అందజేత



మంత్రి విశ్వరూప్ నుంచి అవార్డు అందుకుంటున్న నరసింహారావు

ముమ్మిడివరం: ఠాణేలంక మొల్ల ప్రాంతానికి చెందిన విశ్రాంత ఇంగ్లిష్ ఉపాధ్యాయుడు జేవీఎల్ నరసింహారావుకు గ్యాన్ ఉదయ్‌ఫౌండేషన్ సంస్థ అందించే జాతీయస్థాయి ఇండియన్ ఐకాన్ అవార్డు లభించింది. గురువారం రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ చేతుల మీదుగా ఆయనకు అవార్డు అందజేశారు. కార్యక్రమంలో నక్కా సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇన్సులేటెడ్ వాహనం అందజేత



వాహనం తాళాన్ని లబ్ధిదారుకు అందజేస్తున్న ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్

తాళ్లరేవు: ఆక్వా రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం మంజూరుచేసిన ఇన్సులేటెడ్ వాహనాన్ని ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ లబ్ధిదారురాలైన నల్లి విజయనిర్మలకు అందజేశారు. గురువారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆమెకు వాహనం తాళాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లావణ్య మాట్లాడుతూ పీఎంఎంఎస్‌వై పథకంలో భాగంగా రూ.22.99 లక్షల విలువైన వాహనాన్ని 60 శాతం సబ్సిడీతో అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాయుడు సునీత, ఏఎంసీ చైర్మన్ కుడుపూడి శివన్నారాయణ, ఎఫ్‌డీఓ గోపి, నల్లి బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకు ప్రారంభం

కాట్రేనికోన: మండలంలోని బంటుమిల్లి పంచాయతీ మిలింధానగర్‌లో సీఎస్ఆర్ నిధులతో నిర్మించిన వాటర్ ట్యాంకును ఎమ్మెల్యే పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటింటికీ రక్షిత మంచినీటిని అందించడమే లక్ష్యంగా నియోజకవర్గమంతా గతంలో ఎన్నడూ లేనివిధంగా వాటర్ ట్యాంకులను ఏర్పాటుచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నేల కిషోర్, సర్పంచ్ గంటి వెంకటసుధాకర్, మండల పార్టీ కన్వీనర్ నల్లా నరసింహమూర్తి, నాయకులు ఏడిది చక్రపాణిరావు, నడింపల్లి సూరిబాబు, నాతి సత్యనారాయణ, పాలెపు ధర్మారావు, ఏడిది సుబ్బు, సానబోయిన నాగేశ్వరరావు, సంసాని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పవన్ చీకటి ఒప్పందం బయటపడింది



ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్

అల్లవరం: టీడీపీతో పవన్‌కల్యాణ్ చేసుకున్న చీకటి ఒప్పందం బయటపడిందని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. అల్లవరం మండలం గోడిలోని తన నివాసంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ చంద్రబాబు అరెస్ట్‌పై చంద్రబాబు కుటుంబసభ్యుల కంటే పవన్‌కల్యాణే ఎక్కువగా బాధపడుతున్నాడన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో రూ.371 కోట్ల ప్రజాధనం దుర్వినియోగానికి పాల్పడిన చంద్రబాబుకు మద్దతుగా పవన్ రాస్తారోకోలు, ధర్నాలకు పాల్పడడం చూస్తుంటే ఆయనకూ ముడుపుల అందాయేమోనన్న అనుమానాలు రేకెత్తుతున్నాయన్నారు. పవన్, లోకేష్, బాలకృష్ణ అంతా కలిసే పోటీ చేస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ కేసుల్లో సిమెన్స్ కంపెనీతో జరిగిన ఒప్పందంలో చంద్రబాబు 13 చోట్ల సంతకాలు చేసినట్లు సీఐడీ అధికారులు గుర్తించారన్నారు. పక్కా ఆధారాలతో చట్టం తన పని తాను చేసుకుపోతుంటే పవన్ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఇజ్రాయిల్ ధ్వజమెత్తారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు పవన్, చంద్రబాబులకు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

చవితికి సిద్ధమవుతున్న చలువ పందిళ్లు



అమలాపురంలో చవితి ఉత్సవాల కోసం సిద్ధమవుతున్న షరాబుల చలువ పందిరి

అమలాపురం టౌన్: వినాయక చవితి ఉత్సవాల కోసం పట్టణంలోని గడియారం స్తంభం సెంటర్, ముమ్మిడివరం గేటు సెంటర్, మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో ఉత్సవ నిర్వహణ కమిటీ ప్రతినిధులు చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్నారు. బస్సులు, లారీలు వంటి భారీ వాహనాలు సైతం వెళ్లేంత ఎత్తులో చలువ పందిళ్లను సినిమా సెట్టింగ్‌లు మాదిరిగా నిర్మిస్తుండడం విశేషం. రానున్న నాలుగు రోజుల్లో మొదలయ్యే వినాయక చవితి ఉత్సవాలకు ఈ చలువ పందిళ్లలో తొమ్మిది రోజుల పాటు విఘ్నేశ్వరుడికి పూజాధికాలు, హోమాలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. గడియారం స్తంభం సెంటరులో శ్రీలక్ష్మీ గణపతి ఆలయం, ముమ్మిడివరం గేటు సెంటరులో బులియన్ అసోసియేషన్(షరాబుల పందిరి), మార్కెట్‌లో వర్తకులు చవితి ఉత్సవాలను గత 150 ఏళ్లుగా నిర్వహిస్తూ వస్తున్నారు.

ఉత్సాహంగా జోనల్ వాలీబాల్ పోటీలు



హోరాహోరీగా సాగుతున్న వాలీబాల్ పోటీలు

యానాం: స్థానిక డాక్టర్ వైఎస్సార్ ఇంటర్నేషనల్ ఇండోర్ స్టేడియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో జోనల్ క్రీడా పోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. గురువారం అండర్–17 బాలుర విభాగంలో వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్ నుంచి మొత్తం 12 జట్లు తలపడ్డాయి. ఫైనల్స్‌లో రీజెన్సీ జూనియర్ కళాశాల జట్టు గెలుపొంది ప్రథమ స్థానంలో నిలవగా పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్ ద్వితీయ స్థానాన్ని దక్కించుకుంది. కార్యక్రమంలో జోనల్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాము సత్యనారాయణ, లెక్చరర్ ఇన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ పీవీఎస్ ప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయులు నక్కల సుబ్బన్న పాల్గొన్నారు.

మండల స్థాయి క్రీడా పోటీలు

అమలాపురం రూరల్: మండలంలోని వన్నె చింతలపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి క్రీడా పోటీలను ఎంపీపీ కుడుపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్ గురువారం ప్రారంభించారు. బాలురు, బాలికలకు వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఈవో గుబ్బల సూర్యప్రకాశం, సర్పంచ్ పరమట శ్యామ్, నక్కా రాజరత్నం నాగవాణి, మండల కోఆర్డినేటర్ సంజీవయ్య తదితరులు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ పితామహుడు మోక్షగుండం



కాట్రేనికోన: ఇంజినీరింగ్ పితామహుడు మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి సందర్భంగా కాట్రేనికోనకు చెందిన ప్రముఖ చిత్రకారుడు ఆకొండి అంజి గీసిన చిత్రమిది. ఇంజినీరింగ్ డే శుభాకాంక్షలు తెలుపుతూ ఆయన గీసిన చిత్రాన్ని స్థానికంగా పలువురు ప్రశంసించారు.

ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఆర్‌పీఓ మునిస్వామి తదితరులు

యానాం: ఎయిడ్స్ రహిత సమాజానికి కృషి చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి పేర్కొన్నారు. గురువారం స్థానిక నేతాజీ సుభాష్ చంద్రబోస్ ప్రభుత్వ ఐటీఐలో పుదుచ్చేరి ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆధ్వర్యంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ ఎవేర్‌నెస్ క్యాంపు నిర్వహించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రథమ, ద్వితీయ బహుమతులను, కన్సోలేషన్ ప్రైజులను అందించారు. కార్యక్రమంలో జీజీహెచ్ డీడీ టి.రవిశంకర్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చింతపల్లి కృష్ణ సుధాకర్, వాసంశెట్టి ఆనంద్ పాల్గొన్నారు.

గార్బేజ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభం



గార్బేజ్ ప్రాసెసింగ్ యూనిట్ ప్రారంభించిన మున్సిపల్ చైర్‌పర్సన్ సత్యనాగేంద్రమణి, కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీ డంపింగ్ యార్డ్‌లో కొండలుగా పేరుకుపోయిన 28 వేల టన్నుల లెగసీ వేస్ట్ (చెత్త)ను నాలుగు రకాలుగా శుద్ధి చేసే సాంకేతిక ప్రక్రియ కోసం ఏర్పాటుచేసిన గార్బేజ్ ప్రాసెసింగ్ యూనిట్‌ను మున్సిపల్ చైర్‌పర్సర్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు గురువారం ప్రారంభించారు. రూ.2.01 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ యూనిట్ ద్వారా రోజుకు 200 మెట్రిక్ టన్నుల చెత్తను ప్రాసెస్ చేసే అవకాశం ఉంటుందని చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి తెలిపారు. ప్లాస్టిక్ వేస్ట్‌ను వేరు చేసి విశాఖ జిందాల్ ప్లాస్టిక్ పరిశ్రమకు తరలిస్తామని కమిషనర్ నాయుడు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, మున్సిపల్ డీఈఈ బి.విజయదుర్గ, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ, కముజు రమణ పాల్గొన్నారు.

పశుదాణా దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు

అమలాపురం టౌన్: పశు దాణా విక్రయ దుకాణాల్లో పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎల్.విజయరెడ్డి గురువారం తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమలాపురంలో ఉన్న వెట్ ఫార్మా దేవి ట్రేడర్స్, శ్రీదేవి మెడికల్, జనరల్ స్టోర్స్, వెంకటేశ్వర ట్రేడర్స్, అల్లవరం మండలంలో శ్రీవీరభద్ర ఆంజనేయ రైస్, జనరల్ స్టోర్స్ దుకాణాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం విజయవాడ వెటర్నరీ బయో లాజికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూషన్(వీఆర్‌బీఐ)కు పంపించినట్లు తెలిపారు. ఏ దుకాణంలోనైనా నాణ్యత లోపాలున్నట్లు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. తనిఖీల్లో పశు వైద్యులు జి.శ్రీనివాస్, నారాయణ, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఐ.పోలవరం: మండలంలోని ఐ.పోలవరం, మురమళ్ల గ్రామాల్లో ఉన్న విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల నిమిత్తం వాటి పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు ఈఈ మోకా రవికుమార్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి పంచాయతీ పరిధి సింగరాయిపాలెంలో రూ.4 లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ పెయ్యల రాజ్‌కుమార్ గురువారం శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో వార్డు సభ్యురాలు వాసంశెట్టి నాగలక్ష్మి, వ్యవసాయ సలహా మండలి మండల చైర్మన్ మానే శ్రీను, జంపన బాపిరాజు పాల్గొన్నారు.

నూతన ఆర్టీఓ కార్యాలయం ప్రారంభం

యానాం: స్థానిక సబ్ జైలు వద్ద ఉన్న ఈఎస్ఐ ఆసుపత్రి పైఅంతస్తులో నూతనంగా నెలకొల్పిన రోడ్డు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాన్ని ఆర్‌ఏఓ మునిస్వామి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన వాహనాల రిజిస్ట్రేషన్, డ్రైవింగ్ లైసెన్స్ మంజూరు తదితర సేవలు ఆలస్యమవుతున్నాయని ప్రజల నుంచి ఫిర్యాదులొస్తున్నాయన్నారు. సిబ్బంది క్రమశిక్షణతో పనిచేసి వేగవంతంగా సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీఐ షణ్ముగం, కె.సత్యనారాయణ, కాళ్ల బాలాజీ, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఆర్‌ఏఓకు వినతి పత్రం

యానాం: ఆర్థికంగా వెనకబడిన విభాగం(ఈడబ్ల్యూఎస్) ధ్రువీకరణ పత్రం జారీ చేయడంలో ఆలస్యం వల్ల తాము ఉద్యోగాలను కోల్పోయే ప్రమాదముందని, రెవెన్యూ శాఖ వాటిని వెంటనే జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎల్‌డీసీ, స్టోర్ కీపర్ ఉద్యోగాలకు ఎంపికైన పలువురు అభ్యర్థులు ఆర్‌ఏఓ మునిస్వామిని కలిసి గురువారం వినతి పత్రం అందజేశారు.